

అన్న క్యాంటీన్‌లో ఆనందంగా భోజనం చేస్తున్న పెద్దాయన

# పేదల కోసమే...

**అన్న క్యాంటీన్లను ప్రారంభించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత**



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కమిషనర్

**కల్లూరు, సెప్టెంబరు 21:** ఐదేళ్ల వైసీపీ పాలనలో సామాన్యులు ఎన్నో కష్టాలు పడ్డారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. పేదవాడి ఆకలి తీర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెడితే ఎంతో మానసిక ఆనందం కలుగుతుందన్నారు. కల్లూరు అర్బన్ పరిధిలోని పరిమళనగర్, కల్లూరు ఎస్టేట్‌లో రెండు అన్న క్యాంటీన్లను శనివారం ఎమ్మెల్యే పునఃప్రారంభించారు. ఎమ్మెల్యే గౌరుచరిత పేదలకు అన్నం వడ్డించి, వారితో కలిసి అన్న క్యాంటీన్‌లో భోజనం చేశారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ ఐదు రూపాయలకే పేదల కడుపునింపే బృహత్తర కార్యక్రమానికి ఎన్డీఏ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించడం జరుగుతుందన్నారు. గత వైసీపీ పాలనలో నిర్దాక్షిణ్యంగా క్యాంటీన్లను మూసేసి పేదల కడుపు మాడ్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్ల ప్రారంభానికి సంతకం చేశారన్నారు. కల్లూరు పరిధిలోని నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలో మరో క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని గౌరుచరిత హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, ఆరోగ్యాధికారి విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ వేణుగోపాల్, ఎంఈ శేషసాయి, డీఈ రాజశేఖర్, నాయకులు ఎన్వీ రామకృష్ణ, టైలర్ నాగరాజు, రవి ప్రకాష్‌రెడ్డి, మాదన్న, ఫిరోజ్ పాల్గొన్నారు.




పరిమళనగర్
అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

# ప్రాజెక్టులను పూర్తి చేస్తారా?

- 20 ఏళ్లుగా అసంపూర్తిగా హంద్రీ నీవా
- రూ.200 కోట్లు ఇస్తే పందికోన నుంచి సాగునీరు
- వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు మోక్షం లభించేనా..?
- సీమ రైతుల స్వప్నం గుండ్రేవుల
- శ్రీశైలం, వెలుగోడు, అలగనూరు రిజర్వాయర్లు మరమ్మతులపై దృష్టి సారించాలి
- నేడు ఉమ్మడి జిల్లాలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల పర్యటన

రాయలసీమ ప్రాజెక్టులపై పాలకుల్లో చిత్తశుద్ధి కనిపించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో అంతులేని నిర్లక్ష్యం సీమ జలాశయాలకు శాపంగా మారింది. కొద్దిపాటి నిధులిస్తే వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు శూన్యం. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం, హంద్రీనీవా విస్తరణ పనులను వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. ఆర్భాటంగా ప్రారంభించిన రాయలసీమ దుర్భిక్షం మిషన్ కింద చేపట్టిన కాలువల విస్తరణకు నిధులు ఇవ్వకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. అంతర్ రాష్ట్ర సమస్య అంటూ గుండ్రేవుల ప్రాజెక్టు ఫైల్ పక్కకు నెట్టేశారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో కరువు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పర్యటిస్తారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు ప్రధాన లిఫ్టు మల్యాల పంప్ హౌస్, అనంతపురం జిల్లా జీడిపల్లి, చెర్లోపల్లి జలాశయాలు పరిశీలిస్తారు. హంద్రీనీవా ప్రాజెక్టు సహా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి నిమ్మల దృష్టి సారించాలని, నిధులు ఇచ్చి కరువు రైతుల క'న్నీటి' కష్టాలు తీర్చాలని సీమ సాగునీటి నిపుణులు కోరుతున్నారు.





పత్తికొండ జలాశయం కుడి కాలువ దుస్థితి

**కర్నూలు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** రాయలసీమ ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందించే లక్ష్యంగా హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం చేపట్టారు. శ్రీశైలం జలాశయం ఎగువన ప్రధాన లిఫ్టు మల్యాల పంప్‌హౌస్ నుంచి 40 టీఎంసీలు ఎత్తిపోయాలి. ఫేజ్-1 కింద నంద్యాల జిల్లా మాల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 3,850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో 9.5 మీటర్లు బెడ్ విడ్త్ (కాలువ అడుగు బాగం వెడల్పు)తో 216.30 కి.మీలు ప్రధాన కాలువ, కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ (పందికోన), అనంతపురం జిల్లాలో జీడిపల్లి రిజర్వాయర్లు, 8 ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. నేడు 1,940 క్యూసెక్కులు కూడా ఎత్తిపోయలేని పరిస్థితి ఉంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 7.5 టీఎంసీలు వినియోగించుకొని 80 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉండగా 15-25 వేల ఎకరాలకు కూడా ఇవ్వడం లేదు. ప్రధానంగా పత్తికొండ (పందికోన) జలాశయం కుడి కాలువ (ఆర్‌బీసీ), ఎడమ కాలువ (ఎల్‌బీసీ) కింద 61,394 ఎకరాలకు సాగునీరు అందాలి. పత్తికొండ రిజర్వాయర్ రివెట్మెంట్ (రాతిపరుపు), ఎడమ కాలువల పరిధిలో సింగిల్ లైన్ బిడ్జి (ఎస్ఎల్‌బీ), ఆర్‌బీసీ, ఫీల్డ్ చానల్స్ డిస్ట్రిబ్యూటరీలు, కుడి కాలువ (ఆర్‌బీసీ) పరిధిలో దేవనకొండ, ఆస్పరి మండలాల్లో డిస్ట్రిబ్యూటర్లు, ఫీల్డ్ చానల్స్, ఆర్అండ్‌బీ క్రాసింగ్ బిడ్జిలు, ఎల్‌బీసీ వంటి నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. వీటిని పూర్తి చేస్తే 61 వేల ఎకరాలు సాగునీరు ఇవ్వవచ్చు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. అంచనా విలువ రూ.200 కోట్లకు చేరింది.

హంద్రీనీవా ప్రాజెక్టు అప్రోచ్ కెనాల్ 4.806 కి.మీలు తొలి పంప్‌హౌస్ మల్యాల వద్ద 0/0 కి.మీల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి వరకు 216.300 కి.మీల వరకు 6,500 క్యూసెక్కుల ప్రవాహానికి వీలుగా కాలువ విస్తరణ, 8 పంపింగ్ స్టేషన్ల దగ్గర అదనపు పంపులు ఏర్పాటు కోసం 2021 సెప్టెంబరు 15న రూ.6,182.19 కోట్లు మంజూరు చేసి రెండు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారు. ప్యాకేజీ-1 కింద అప్రోచ్ కెనాల్ 4.806 కి.మీలు, 0/0 నుంచి 88.000 కి.మీల వరకు

### ● విస్తరణ పేరిట నిర్లక్ష్యం!

ప్రధాన కాలువ విస్తరణ, పంపింగ్ స్టేషన్(పీఎస్)-1 నుంచి 5 (5 లిఫ్టులు) దగ్గర అదనపు పంపులు ఏర్పాటు కోసం రూ.3,278.18 కోట్లతో చేపట్టే పనులు హైదరాబాదుకు చెందిన మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ 0.112 శాతం లెస్‌కు, ప్యాకేజీ-2 కింద 88.00 కి.మీల నుంచి 216.300 కి.మీల వరకు ప్రధాన కాలువ విస్తరణ, పీఎస్-6 నుంచి 8 (3 లిఫ్టులు) వద్ద అదనపు పంపులు ఏర్పాటుకు రూ.2,904.01 కోట్లతో చేపట్టే పనులు ప్యాకేజీ-2 హైదరాబాదుకు చెందిన ఎస్ఆర్-వీపీఆర్ జాయింట్ వెంచర్‌గా 0.107 శాతం లెస్‌కు దక్కించుకున్నారు. 2021 డిసెంబరు 31న ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటికీ గంపెడు మట్టి తీయలేదు. విస్తరణ పేరిట నిర్లక్ష్యం చేశారు. అలాగే. అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 26 టీఎంసీలు వినియోగించుకొని 4.05 లక్షల ఎకరాకలు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని హంద్రీనీవా రెండవ దశ (ఫేజ్-2) పనులు చేపట్టారు. 216.300 నుంచి 565.00 కి.మీల వరకు 349 కి.మీలు ప్రధాన కాలువ, సత్యసాయి జిల్లాలో గొల్లపల్లి, చెర్లోపల్లి, మారాల జలాశయాలు, అన్నమయ్య జిల్లా శ్రీనివాసపురం, చిత్తూరు జిల్లా అడవిపల్లి జలాశయాలు చేపట్టారు. రూ.5,602.36 కోట్లతో చేపడితే 53.52 శాతం పనులు చేసి రూ.2,998.63 కోట్లు ఖర్చు చేశారు. గత జగన్ ప్రభుత్వంలో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

### ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి



రాష్ట్ర విభజన తరువాత అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిత్యం కరువుతో తల్లడిల్లుతున్న మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాలకు సాగునీరు, 1.20 లక్షల జనాభాకు తాగునీరు అందించే లక్ష్యంగా ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి రూ.1,985.42 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. ప్రధాన కాలువ కొటేకల్లు, కోసిగి, పెద్దకడుబూరు, చిన్నమరివీడు జలాశయాల నిర్మాణాలు చేయాలి. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల జనాభాకు సాగునీటి అందించాలని వేదవతి ఎత్తిపోతల పథకం రూ.1,94.80 కోట్లతో చేపట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఆ తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం వల్ల ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

### ● గుండ్రేవుల జలాశయంపై కూడా..

ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల రైతుల చిరకాల స్వప్నం గుండ్రేవులు జలాశయం. కేసీ కెనాల్ కింద 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు, 31.90 టీఎంసీల నికరజలాలు వాటా ఉంది. ఆ నీటిని నిల్వ చేసుకునే జలాశయం లేదు. సుంకేసుల బ్యారేజీ ఎగువన తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. ఉమ్మడి ఏపీలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సర్వే, డీపీఆర్ కోసం రూ.54.95 లక్షలు మంజూరు చేస్తూ 2013 నవంబరు 1న జీఓ నంబరు.100 జారీ చేశారు. హైదరాబాదుకు చెందిన ఆవ్వే ఆసోసియేట్స్ సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకొని ప్రభుత్వానికి డీపీఆర్ ఇచ్చింది. రాష్ట్ర విభజన తరువాత అధికారం చేపట్టి చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలకు ముందు 2019 ఫిబ్రవరి 21న రూ.2,890 కోట్లు మంజూరు చేస్తూ జీఓ నం.153 జారీ చేసింది. ఆ తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వం అంతర్ రాష్ట్ర జల సమస్య అంటూ ఫైల్‌ను పక్కకు నెట్టేసింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

### ● వెలు'గోడు' వినేదెవరు..?

తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా 16.95 టీఎంసీల సామర్థ్యంతో వెలుగోడు జలాశయం నిర్మించారు. ఆనకట్ట 11.64 కి.మీటర్లు పొడవు, 28 మీటర్లు, ఎత్తు, 6 మీటర్లు పైభాగం వెడల్పుతో నిర్మించిన ఆసియాలోనే అతి పొడవైన మట్టి ఆనకట్ట జలాశయం ఇది. లోపలి భాగంలో వెదర్ రాక్ రివిట్మెంట్ (రాతిపరుపు) బండ్ పొడవున అక్కడక్కడ వెయ్యి మీటర్లకు పైగా రివిట్మెంట్ కుంగిపోయి ప్యాచెస్‌లు ఏర్పడ్డాయని ఇంజనీర్లు గుర్తించారు. గత టీడీపీ ప్రభుత్వంలో డ్యాం రిహ్యాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డ్రిప్)-2 కింద రూ.99 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు రాలేదు. కుంగిన రాతిపరుపు మరమ్మతులు, ఎర్త్‌డ్యాం బండ్ 11.64 కిలోమీటర్లు బలోపేతం, బయటి వైపున మట్టికట్ట కోతకు గురికాకుండా గ్రాస్ పెంపకం, స్పిల్‌వే గేట్ల మరమ్మతులు కోసం రూ.150-155 కోట్లు కావాలని డ్రిప్-3 కింద మరోసారి ప్రతిపాదనలు పంపినట్లు ఇంజనీర్లు పేర్కొంటున్నారు.




మరమ్మతులు లేక ఒట్టిపోయిన అలగనూరు జలాశయం

### జీఆర్‌పీ ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులేవీ..?

మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 45 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులో భాగంగా స్టేజ్-1 కింద 7, స్టేజ్-2 కింద 8 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. విద్యుత్ బిల్లులు, మరమ్మతులు, నిర్వహణ సిబ్బంది జీతాలు కోసం ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్ (ఓ అండ్ ఎం) కోసం గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కపైసా ఇవ్వలేదు. రెండేళ్ల క్రితమే రూ.15 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. తాజాగా రూ.18-20 కోట్లకు చేరింది. తాజాగా ఈ ఎత్తిపోతల పథకాల్లో దొంగల పడి విలువైన కాపర్ వైరు, పవర్ ఆయిల్ దోచుకెళ్లారు. వీటి తక్షణ మరమ్మతులకు రూ.5.4 కోట్లు కావాలని ఇంజనీర్లు అంటున్నారు. అలాగే.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ సాగునీటి కాలువలు, ప్రాజెక్టు పరిధిలో తక్షణ మరమ్మతులు 146 పనులకు రూ.12.77 కోట్లు నిధులు ఇవ్వాలని నివేదిక పంపారు.

### ● శ్రీశైలం మరమ్మతులకు రూ.205 కోట్లు కావాలి



శ్రీశైలం ప్రాజెక్టు ఆనకట్ట స్పిల్‌వే గేట్ల దిగువన ప్లంజ్‌పూల్ ప్రాంతంలో 45 మీటర్లు లోతు, 270 మీటర్లు వెడల్పు, 400 మీటర్లు పొడవుతో భారీ గుంత ఏర్పడింది. ప్లంజ్‌పూల్ వల్ల డ్యాం భద్రతకు, ప్రాజెక్టు రెండు వైపుల ఉన్న గట్లు, ఆనకట్ట పునాదిపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరించారు. ప్లంజ్‌పూల్ అధ్యనం కోసం రూ.17 కోట్లు, డ్యాం శాశ్వత మరమ్మతులపై ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు డాక్టరు హ్యానిశ్ శాలం, అభిషేక్‌కుమార్‌ల సూచనల మేరకు 'డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం' (డ్రిప్)-2 కింద రూ.203 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు. తెలుగు రాష్ట్రాలకు జీవనాడి అయినా శ్రీశైలం ప్రాజెక్టు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ● అలగనూరుకు మరమ్మతులు ఎప్పుడో..?

కేసీ కాలువ ఆయకట్టు 2.65 ఎకరాలు. చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంగా 1999లో 2.96 టీఎంసీల సామర్థ్యంతో అలగనూరు జలాశయం 3,358 ఎకరాల విస్తీర్ణం, 7.5 కి.మీల పొడవు, 22 మీటర్ల ఎత్తులో మట్టి ఆనకట్ట (ఎర్త్‌బండ్) నిర్మించారు. 2005లో తొలిసారిగా నీటిని నింపారు. ఐదేళ్ల క్రితం 200 మీటర్లకుపైగా కట్ట కుంగిపోయింది. రూ.3 కోట్లతో మరమ్మతులు చేపట్టినా కంట్రాక్టరు సకాలంలో పనులు చేయలేదు. ఆ పక్కనే కుంగిపోయింది. నిపుణుల కమిటీ సూచన మేరకు రూ.22 కోట్లకు ప్రతిపాదనలు పంపితే గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు నోచుకోలేదు.

## జగన్‌ను జైలుకు పంపాలి

**ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో సోమిశెట్టి ధ్వజం**



సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 21:** తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయించిన జగన్‌ను జైలుకు పంపించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం శంకర మఠం వీధిలో జరిగిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో జగన్ సాగించిన అవినీతి, మాఫియా పాలనను ప్రజలు ఓటుతో తరిమి కొట్టి కూటమికి అవకాశం ఇచ్చారన్నారు. వంద రోజుల పాలనలో మందికి మేలే చేకూరిందని తెలిపారు. 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలు, వృద్ధులు, వికలాంగులు, ఆసరా పింఛన్లు కూడా అందించడంతోపాటు డీఎస్సీ నోటిఫికేషన్, అన్నక్యాంటీన్ల ఏర్పాటు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయడంతోపాటు రాష్ట్రంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు పరుగులు పెట్టించారని తెలిపారు. విజయవాడ వరదల్లో సైతం బాధితులకు దగ్గర ఉండి సహాయం అందించి ఆదుకున్న తీరును యావత్తు ప్రజలు హర్షిస్తున్నారని గుర్తు చేశారు. దీపావళి నాటికి దీపం పథకం కింద మహిళలకు వంట గ్యాస్ సిలిండర్లు, త్వరలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి వాటిని కూడా అమల్లోకి తీసుకు రానున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, కే. నాగేంద్ర కుమార్, సోమిశెట్టి నవీన్, ఎస్ అబ్బాస్, ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.

## రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21:** కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ పి. రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మంత్రాలయంలో మరో 200 గదులు

**భక్తుల విరాళాలతో నిర్మాణం**



మంత్రాలయంలో 200 గదుల సముదాయం

**మంత్రాలయం, సెప్టెంబరు 21:** మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో పూర్వ పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల విశ్రాంతి నిలయంపైన మరో (200 గదుల సముదాయం నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. శనివారం వారు విలేఖరులతో మాట్లాడుతూ మరో 200 గదుల నిర్మాణానికి గాను ఇప్పటికి ఒక్కో గదికి రూ.7 లక్షల ప్రకారం 113 గదులకు రూ.5.50 కోట్లు దాతలు ఇచ్చారని తెలిపారు.

## మహాకవి గురజాడ

**కలెక్టర్ పి.రంజిత్ బాషా**



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21:** సాహిత్యంతో సమాజాన్ని చైతన్యవంతం చేసిన మహాకవి గురజాడ అప్పారావు అని కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. శనివారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో గురజాడ అప్పారావు 162వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురజాడ అప్పారావు 1862 సెప్టెంబరు 21న జన్మించారని అన్నారు. దేశభక్తి, ఆధునిక కవిత్వం, సంస్కరణలు, సంఘ చైతన్యం వంటి ఉదాత్త భావాలతో వాడుక భాషల్లో రచనలు చేసిన మహాకవి గురజాడ అని పేర్కొన్నారు. గ్రాంధిక భాష, చందస్సుతో కూడిన పద్య రచనలు చేస్తున్న కాలంలో ప్రజల భాష అయిన వాడుక భాష కోసం గిడుగు రామ్మూర్తితో కలిసి పోరాడిన మహాయోధుడు అని కొనియడారు. జాయింట్ కలెక్టర్ బి. నవ్య మాట్లాడుతూ గురజాడ అప్పారావు సంఘ సంస్కర్త, సామాజికవేత్త అన్నారు. తెలుగు వాడుక భాషలో ఎన్నో రచనలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో చిరంజీవి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి జయమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రైతు ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

**మద్దికెర, సెప్టెంబరు 21:** పంటలు చేతికందక.. అప్పులకు వడ్డీలు కట్టలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మద్దికెర మండలంలో శనివారం చోటు చేసుకుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన రమేష్ నాయుడు, ప్రభావతమ్మ దంపతుల కుమారుడు సురేష్ (35) తమకున్న వ్యవసాయ పొలంతో పాటు మరో 22 ఎకరాల తోటను కౌలుకు తీసుకుని ఎక్కువ శాతం మిరప పంటను చేశాడు. గత మూడేళ్ల నుంచి ఆశాజనకంగా పంటలు లేకపోవడం, ధరలు లేకపోవడంతో దాదాపు రూ.20 లక్షల మేర అప్పులు చేశాడు. ఈ ఏడాది కూడా మిరప పంట సాగు చేసినప్పటికీ ధరలు లేకపోవడంతో మనోవేదనకు గురై శనివారం ఉదయం విషగుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం జిల్లా గుంతకల్లు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రైతు సురేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్దికెర ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ నాయకులు బురుజుల శ్రీనివాస్ నాయుడు, ఎర్రిస్వామి, ప్రదీప్, యుగంధర్ కోరారు.

## నేడు సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల కౌన్సెలింగ్

● డీఐజీ కార్యాలయంలో హాజరుకానున్న నాలుగు జిల్లాల సబ్ రిజిస్ట్రార్లు

**కల్లూరు, సెప్టెంబరు 21:** సాధారణ బదిలీల్లో భాగంగా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు శనివారం డిఐజీ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆదివారం కర్నూలు జిల్లా కేంద్రంలోని వెంకటరమణ కాలనీ రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్‌ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈమేరకు ఉమ్మడి రాయలసీమ నాలుగు జిల్లాల డీఐజీలు హాజరుకానున్నట్లు కార్యాలయ అధికారులు వివరించారు. ముందుగా జిల్లాల వారిగా సబ్ రిజిస్ట్రార్‌లకు, మధ్యాహ్నం సీనియర్ అసిస్టెంట్‌లకు బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. సబ్ రిజిస్ట్రార్లను కేటగిరీల వారిగా (ఏ, బి, సి) బదిలీలు జరుపనున్నారు. రూ.50 కోట్లకు పైబడి ఆదాయం ఉన్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను ఏ-కేటగిరి, రూ.50 కోట్లకు తక్కువ ఆదాయం ఉంటే బీ-కేటగిరి, రూ.15 కోట్ల కంటే తక్కువ ఆదాయం ఉంటే సి-కేటగిరిగా పరిగణించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 24 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు ఉండగా ఏ-కేటగిరిలో-5, బీ-కెటగిరీలో- 5, సీ-కేటగిరిలో-14 రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. బదిలీల ప్రక్రియలో రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ అదేశాలకు లోబడి బదిలీలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## సబ్ జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న కర్నూలు జిల్లా న్యాయాధికారి కబర్ది

**నందికొట్కూరు, సెప్టెంబరు 21:** నందికొట్కూరు పట్టణంలోని ఉప కారాగారాన్ని కర్నూలు జిల్లా న్యాయాధికారి కబర్ది, డీఎల్ఎస్ఏ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కబర్ది మాట్లాడుతూ ఖైదీల ఆరోగ్యం, క్షేమాలు, భోజన వసతి సౌకర్యాలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలపై ఖైదీలకు అయన వివరించారు. ఈయన వెంట నందికొట్కూరు సీనియర్ న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని, జూనియర్ సివిల్ న్యాయాధికారి దివ్య, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అరుణ్ కుమార్, సబ్ జైల్ సూపరింటెండెంట్ మల్లయ్య ఉన్నారు.

## 23 వరకే ఈక్రాప్, ఈకేవైసీ నమోదు

వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి

**కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 21:** ఈక్రాప్, ఈకేవైసీ నమోదుకు ఈ నెల 23వ వరకే అవకాశం ఉందని, త్వరపడి రైతులు ఆ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసి అప్‌లోడు చేస్తారని అన్నారు. ఇప్పటి దాకా 70 శాతం పంటలకు ఈక్రాప్, ఈకేవైసీ నమోదైందని తెలిపారు. ఇంకా 33 శాతం ప్రక్రియ అసంపూర్తిగా ఉందని తెలిపారు. వాస్తవానికి ఈ నెల 15తోనే ఈక్రాప్ నమోదు పూర్తి కావాల్సి ఉన్నా.. వివిధ కారణాల వల్ల ఈక్రాప్, ఈకేవైసీ నమోదులో ఆలస్యం జరిగిందన్నారు. అందువల్ల ప్రభుత్వం ఈ నెల 23వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని కోరారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**కర్నూలు, సెప్టెంబరు 21:** నగర శివారులో గుత్తి పెట్రోలు బంకు వద్ద కృష్ణకుమార్ (51) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద లభించిన ఆధారాలతో బంధువులకు సమాచారం ఇచ్చారు. స్థానిక అరోరా నగర్‌కు చెందిన కృష్ణకుమార్ గతంలో ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొద్ది రోజులుగా ఆయన మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. శుక్రవారం రాత్రి కూడా తాగి ఇంటికి వెళ్లగా.. ఇంట్లో వాగ్వాదం జరిగింది. దీంతో బైటికి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం శవమై కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి బంధువులకు అప్పగించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కోవెలకుంట్లలో వృద్ధుడు

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 21 :** కోవెలకుంట్ల మండల పరిధిలోని సౌదరి దిన్నె గ్రామ సమీపంలో రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కడప జిల్లా జమ్మలమడుగు మండలం మోరగుడికి చెందిన దండె సూర్యనారాయణ (60) సౌదరదిన్నెలో బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం గ్రామానికి వెళ్తూ తెల్లవారుజామున రైలు కింద పడి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు..

**అవుకు, సెప్టెంబరు 21 :** అవుకు మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన తలారి ప్రశాంత్ (21) అనే యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ప్రశాంత్ మద్యానికి బానిసై అప్పులు చేస్తుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్థాపానికి చెందిన ప్రశాంత్ ఈ నెల 11వ తేదీన అవుకు సమీపంలోని ఎస్సార్బీసీ కాల్వ వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వటంతో కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని తండ్రి గంగులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

## సహస్ర హాస్పిటల్‌లో రోగి మృతి

మృతదేహంతో ధర్నా చేసిన బంధువులు

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 21:** సహస్ర హాస్పిటల్‌లో రోగి మృతి చెందడంతో బంధువులు ధర్నాకు దిగారు. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం పందికుంటకు చెందిన 38 ఏళ్ల అనిల్ పేగు మడత పడిందంటూ గాయత్రి ఎస్టేట్‌లోని సహస్ర ఆసుపత్రిలో చేరాడు. అడ్మిషన్ చేసుకున్న వైద్యులు ఆపరేషన్ తర్వాత రోగి మృతి చెందాడు. దీంతో బంధువులు మృతదేహంతో ఆందోళన చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. త్రీటౌన్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు బంధువులకు మధ్య వాగ్వివాదం జరిగింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఎన్టీఆర్ వైద్య సేవ ఉన్నా హాస్పిటల్‌లో డబ్బులు వసూలు చేస్తున్నారని బంధువులు ఆరోపించారు.

## జేఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు బదిలీలు

ఉత్తర్వులు ఇచ్చిన ఎస్ఈ ఎం.ఉమాపతి

**కల్లూరు, సెప్టెంబరు 21:** విద్యుత్ శాఖ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి జేఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు బదిలీలు ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులు డివిజన్ నుంచి మరో డివిజన్‌కు బదిలీ చేయాలని అభ్యర్థించిన నేపథ్యంలో ఎస్ఈ ముగ్గురు జేఎల్‌ఎంలకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు.

# ఆత్మస్థైర్యమే అండ

● క్యాన్సర్ రోగికి చికిత్స కంటే సాంత్వన ముఖ్యం
● రోగులకు ప్రత్యేక కౌన్సిలర్లు అవసరమంటున్న నిపుణులు
● నేడు వరల్డ్ రోజ్ డే



**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 21:** శరీరాన్ని రోగం పీడిస్తుంటే.. మనస్సు ఒత్తిడికి గురవుతుంది. మనోల్లాసం కరువై రోగి జీవితం వ్యథగా మారుతుంది. రోగం వల్ల ఏడాదిలోనే చనిపోతారనుకొనే వ్యక్తి మానసిక ఒత్తిడి వల్ల ఆరు నెలల్లోనే కాలం చేసే ప్రమాదం ఉంది. అందుకే భాధితులకు సాంత్వన అవసరమని వైద్యులు చెబుతారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధి బారిన పడ్డామని తెలిసిన మరుక్షణమే అధైర్యానికి గురవుతారు. అందుకే రోగికి చికిత్స కంటే స్వాంతన ముఖ్యం. క్యాన్సర్ రోగులకు ఇది అత్యవసరం. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం సెప్టెంబరు 22న ప్రపంచో ఆరోగ్య గులాబీ దినోత్సవం (వరల్డ్ రోజ్ డే) నిర్వహిస్తున్నది.



కెనడా దేశానికి చెందిన మెలిండా రోజ్ అనే అమ్మాయి గౌరవార్థం క్యాన్సర్ రోగుల కోసం ప్రపంచ గులాబి దినోత్సవం జరుపుకుంటారు. మెలిండా రోజ్ 12 సంవత్సరాల వయస్సులో అరుదైన బ్లడ్ క్యాన్సర్ అస్కిన్స్ ట్యూమర్‌తో బారిన పడింది. ఆ వ్యాధి నిలువెల్లా తినేసింది. ఈ క్రమంలో ఆమె కొన్ని వారాలు మాత్రమే బ్రతుకుతుందని డాక్టర్లు చెప్పారు. కానీ మనోధైర్యం ఉంటే ఆయుష్షును కూడా పెంచుకోవచ్చని ఆ చిన్నారి నిరూపించింది. కొన్ని వారాలు మాత్రమే జీవిస్తుందన్న ఆమె ఆరు సంవత్సరాలు జీవించింది.

● **క్యాన్సర్ అంటే ఏమిటి ..?**

మానవ శరీర నిర్మాణం కణ విభజనపై ఆధారపడి ఉంటుంది. శరీరంలోని అన్ని అవయవాల్లోను నిరంతరం కణవిభజన నియమిత ప్రక్రియలో జరుగుతుంది. శరీర అవసరాలకు అనుగుణంగా కణవిభజన జరగడం ఆరోగ్యం. కానీ ఎక్కువ తక్కువగా జరిగితే ప్రమాదకరం. ఇలా జరిగినప్పుడు శరీరం తనపై కణాలు చనిపోయి క్యాన్సర్ కణాలు అభివృద్ధి చెందుతాయి. దీన్ని క్యాన్సర్ అంటారు. శరీరంలోని ఏదో ఒక ప్రాంతంలో ఇది ప్రారంభమై చివరికి శరీరమంతాటా విస్తరిస్తుంది. కణ విభజన జరగని గోళ్లు, వెంట్రుకలు, కంటిపైన ఉండే కార్నియాలకు జీవం ఉండదు. కాబట్టి వాటికి సోకదు. మిగిలిన ఏ ప్రాంతానికైనా క్యాన్సర్ సోకవచ్చు. క్యాన్సర్లలో అత్యాధునికంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులే ఎక్కువ. వీటి తర్వాత నోరు, బ్రెస్ట్, లివర్, పెద్దప్రేగు, పొట్ట, అన్నవాహిక, క్యాన్సర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

### ఆత్మస్థైర్యాన్ని పెంచాలి



క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచాలి. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇందు కోసమే సెప్టెంబరు 22 వరల్డ్ రోజ్ డే నిర్వహిస్తున్నారు. ప్రజల్లో కూడా రోగుల పట్ల అపోహలు ఉన్నాయి. రేడియేషన్ వల్ల ప్రమాదమని భావిస్తారు. ఇటువంటి అపోహలను వదలుకోవాలి. వ్యాధి గురించి ఎక్కువ ఆలోచించడం ఆందోళన వల్ల రోగులు త్వరగా చనిపోతారు. రోగులు ఏ స్థాయిలో ఉన్నా ఎదుర్కొంటున్న ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉంటే క్యాన్సర్‌నైనా జయించి బతకవచ్చు. ఇందుకు మిలిందారోజ్ ఉదాహరణగా చెప్పవచ్చు.

- డాక్టర్ సి.వాసురెడ్డి, సీనియర్ సర్జికల్ అంకాలజిస్టు, వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, కర్నూలు

### రోగులకు భరోసా అవసరం



క్యాన్సర్ రోగులకు సాంత్వన కల్పించడం ప్రధాన అంశం. రోగులకు మానసిక స్థైర్యాన్ని కల్పిస్తే వ్యాధి నయమయ్యేందుకు దోహదపడుతుంది. మన దేశంలో వైద్యులే రోగులకు కౌన్సిలింగ్ చేస్తారు. చికిత్సకు వచ్చే సమయంలోనే కొంత సేపు రోగితో మాట్లాడి వ్యాధి గురించి అవగాహన కల్పిస్తున్నాం. ధైర్యమే మనిషిని మరింత కాలం బతికేలా చేస్తుంది.

- డాక్టర్ వై.వెంకట్రామిరెడ్డి, రేడియేషన్ అంకాలజిస్టు, ఓమెగా హాస్పిటల్, కర్నూలు

### ● క్యాన్సర్‌పై అవగాహన పెరగాలి



క్యాన్సర్ ఎందుకు వస్తుందన్న విషయంపై చాలా మందికి అవగాహన లేదు. ఈ వ్యాధిపై అవగాహన పెరగాలి. శరీరంలోని ఏ అవయవానికైనా క్యాన్సర్ రావచ్చు. అమీలియో హాస్పిటల్‌లో 50 పడకలతో క్యాన్సర్ వ్యాధికి అందుబాటులో వైద్యం ఉంది. ప్రపంచంలో అత్యుత్తమ నాణ్యమైన రేడియోథెరపీ ఉంది. దీంతో పాటు సర్జికల్, మెడికల్ అంకాలజీ వైద్యులు, రేడియేషన్ అంకాలజీ వైద్యులు పూర్తి స్థాయిలో ఉన్నారు.

- డాక్టర్ బి. రేవతి, మెడికల్ అంకాలజిస్టు అమీలియో హాస్పిటల్, కర్నూలు

## సీమ ఉద్యమకారుడు కామిని వేణుగోపాల్‌రెడ్డి మృతి



వేణుగోపాల్ రెడ్డి (ఫైల్)

నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 21 :** రాయలసీమ ఉద్యమకారుడు, కుందూ పోరాట సమితి వ్యవస్థాపకుడు కామిని వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం కోవెలకుంట్లలోని స్వగృహంలో పలువురు రాయలసీమ ఉద్యమకారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆయన భౌతిక కాయానికి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి.. వేణుగోపాల్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువునేల రాయలసీమ సమస్యలు 80 శాతం నీటి వల్లనే తొలగుతాయని నమ్మిన వ్యక్తి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. రాయలసీమకు నీరు సాధించేందుకు ఆయన రాజీ లేని పోరాటం చేస్తున్నాడన్నారు. సిద్ధేశ్వరం వద్ద క్రిష్ణానదిపై తీగల వంతెన బదులు బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణం చేయాలని ఒక వైపు ఉద్యమం చేస్తూ మరో వైపు సుప్రీంకోర్టు తలుపులు తట్టిన ఉద్యమకారుడు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ అంతిమ యాత్రలో కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, బీవీ ప్రసాద్‌రెడ్డి, రాయలసీమ ఉద్యమ నేతలు అనంతపురం జిల్లా రామ్‌కుమార్, తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి, అశోక్‌వర్ధన్‌రెడ్డి, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ రామాంజనేయులు, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరధరామిరెడ్డి, ఏర్వ రామచంద్రరెడ్డి, జ్యోతిర్మయి, హనుమంతరెడ్డి, కోవెలకుంట్ల ప్రజాసంఘాల నాయకులు కరీంబాషా, రచయిత కాశిపురం ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఘనంగా నివాళులర్పించారు.



కామిని వేణుగోపాల్‌రెడ్డి పార్థీవ దేహానికి పూలమాలలు వేస్తున్న రాయలసీమ ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి

## దొంగ అరెస్ట్

రూ.1.50 లక్షల నగదు స్వాధీనం

**నంద్యాల క్రైం, సెప్టెంబరు 21 :** నంద్యాలలోని నూనెపల్లె సమీపంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఈ నెల 2వ తేదీ జరిగిన చోరీ కేసును త్రీ టౌన్ పోలీసులు ఛేదించారు. షేక్ ఇంతియాజ్ వద్ద ఉన్న రూ.2.60 లక్షల నగదును గుంటూరు జిల్లా స్టువర్టుపురం గ్రామానికి చెందిన మానుపాటి దుర్గా ప్రసాద్ దొంగలించాడని త్రీ టౌన్ సీఐ సూర్యమౌళి శనివారం తెలిపారు. దుర్గాప్రసాద్‌ను నూనెపల్లె ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద అరెస్ట్ చేశామని, గతంలో విశాఖపట్టణంలో దొంగలించిన స్కూటీని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగ వద్ద వున్న రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దుర్గాప్రసాద్‌కు సహకరించిన నెల్లూరు జిల్లా బిట్రగుంట గ్రామానికి చెందిన దొడ్డ జాన్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ వెల్లడించారు.

## లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

**ఆత్మకూరు, సెప్టెంబరు 21:** ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో లారీ కింద పడి ముర్తుజాబి(65) అనే వృద్ధురాలు మృతి చెందింది. ఆత్మకూరు పట్టణానికి చెందిన ఓ లారీ నంద్యాల టర్నింగ్ సప్లయిర్స్ దుకాణం వద్ద సామాన్లు దింపి అక్కడి నుంచి కదులుతోంది. అక్కడ పట్టణంలోని మోమిన్ నగర్‌కు చెందిన ముర్తుజాబీ అనే వృద్ధురాలు ఉండటంతో లారీ ఆమెను తగిలింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలి కాలిపై లారీ టైరు ఎక్కడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. దీంతో అక్కడున్న వారు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు జలవనరుల శాఖ మంత్రి రాక

**నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 21 :** ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామనాయుడు ఆదివారం నందికొట్కూరు మండలం రానున్నారు. నందికొట్కూరు మండలం మల్యాల గ్రామం వద్ద గల హంద్రీనీవా ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శిస్తారు. ప్రాజెక్టుల నిర్వహణ, పని తీరుపై సమీక్షించనున్నారు. రైలు మార్గంలో ఉదయం డోన్ చేరుకొని అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ అతిథి గృహానికి వెళ్తారు. నీటి పారుదల శాఖా అధికారులతో సమీక్ష నిర్వహించి అనంతరం మల్యాల వద్ద గల హంద్రీనీవా ప్రాజెక్టును పరిశీలిస్తారు.

## కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

● మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్ పాల్గొన్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21:** కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లా అభివృద్ధికి వినియోగించుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అధ్యక్షతన దిశా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల శాఖలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మాదిరిగానే జిల్లాలో అన్ని శాఖల్లో అభివృద్ధి పనులు వేగంగా జరగాలని అన్నారు. అధికారులు జవాబుదారితనంతో, సమన్వయంతో పని చేయాలని కోరారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె గృహాల్లో ఉండడం వల్ల పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని ఎంపీ స్త్రీ, శిశు సంక్షేమ అధికారిని ఆదేశించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ఈ-పంట నమోదు సక్రమంగా జరగడం లేదని అన్నారు. పంటను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ఆలూరులో ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు ఐదు ఎకరాలు ఇస్తామని ఓ వ్యక్తి ముందుకు వచ్చారని అన్నారు. అందుకు సంబంధించి వెరిఫై చేయాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. పాఠశాల భవనాల స్థితిగతులను వెరిఫై చేసేందుకు పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులను వినియోగించుకోవాలని సూచించారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, కేజీబీవీ పాఠశాలలో సీట్లు పెంచే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇన్‌ఫెర్టిలిటీ సేవలు అందుబాటులో ఉండాలి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

రాష్ట్ర ఇన్‌ఫెర్టిలిటీ వైద్యుల సదస్సులో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 21:** సంతానలేమి ఇన్‌ఫెర్టిలిటీ వైద్యసేవలు పేదలకు తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తీసుకరావాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వైద్యులను కోరారు. శనివారం కర్నూలు మౌర్యఇన్ హోటల్‌లో రెండు రోజుల ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెంట్ రీప్రొడెక్షన్ (ఐఎస్ఏఆర్) రాష్ట్ర ఇన్‌ఫెర్టిలిటీ వైద్యుల సదస్సును పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీకి మాతృత్వం వరమని, ఇన్‌ఫెర్టిలిటీ వైద్యం పేదలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఐఎస్ఏఆర్ జాతీయ కార్యదర్శి డా. ఆశాబక్షి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇన్‌ఫెర్టిలిటీ వైద్యులు 6వేల మంది ఉన్నారని, ఏపీలో 2017 ఈ సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం కర్నూలులో ఇన్‌ఫెర్టిలిటీ వైద్యాన్ని పరిచయం చేసిన సీనియర్ గైనకాలజిస్టులు డా.బీటీ సీత, డా.తిరుపాల్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డా.విష్ణుప్రియ, కార్యదర్శి డా.డి.విజయలక్ష్మి, ఐఎస్ఏఆర్ రాష్ట్ర అధ్యక్షరాలు డా.పద్మలత, ఎగ్జిక్యూటీ కమిటి సభ్యులు డా.శ్రావ్య, డా.శిరీషారెడ్డి, 300 మంది వివిధ రాష్ట్రాల నుంచి ఇన్‌ఫెర్టిలిటీ, గైనిక్ వైద్యులు పాల్గొన్నారు.

## దొంగ అరెస్టు

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 21 :** కోవెలకుంట్ల పట్టణంలో చోరీ చేసిన దొంగను అరెస్టు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కోవెలకుంట్లలోని ముదిగేడు రోడ్డులో రైల్వే బ్రిడ్జి వద్ద శివకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న కిరాణం షాపులో దొంగతనం చేసి రూ.35 వేలు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. అతని నుంచి రూ.34 వేలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. శివకుమార్ తమిళనాడులోని వివిధ పోలీసుస్టేషన్‌లలో షట్టర్ బ్రేకింగ్ కేసుల్లో ఉన్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. రేణిగుంటలో కూడా కేసు ఉన్నట్లు వెల్లడించారు.

## రెవెన్యూ శాఖలో బదిలీలు

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21:** రెవెన్యూ శాఖలో పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు శనివారం బదిలీ అయ్యారు. కర్నూలు అర్బన్ తహసీల్దార్‌గా పని చేస్తున్న రామానుజనమ్మను దేవనకొండకు, పత్తికొండ తహసీల్దార్‌గా ఉన్న వెంకటలక్ష్మిని కర్నూలు అర్బన్ తహసీల్దార్‌గా, పత్తికొండ ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పని చేస్తున్న సతీష్‌ను హొళగుంద తహసీల్దార్‌గా నియమించారు. అంతకముందు హొళగుంద తహసీల్దార్‌గా పని చేస్తున్న ప్రసాద్ రాజును పత్తికొండ ఆర్డీవో కార్యాలయం డీఏవోగా మార్చారు. సీసీఎల్ఏలో పని చేస్తున్న శ్రీనివాసరెడ్డిని సి.బెళగల్ తహసీల్దార్‌గా, ఇక్కడ పని చేసిన విజయశ్రీని కలెక్టరేట్ ఏవోగా నియమించారు. నంద్యాల జిల్లా నుంచి ఓర్వకల్లు తహసీల్దార్‌గా విద్యాసాగర్ నియమితులయ్యారు. కలెక్టరేట్ ఏవోగా పని చేస్తున్న రాజేశ్వరిని డీఆర్వో సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా, అంతకముందు ఈ స్థానంలో యోగేశ్వరిదేవిని తుగ్గలి తహసీల్దార్‌గా నియమించారు. వీరితోపాటు 42 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 12 మంది జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు బదిలీ అయ్యారు. నంద్యాల నుంచి కర్నూలుకు 15 మంది, కర్నూలు నుంచి నంద్యాలకు 13 మందికి స్థాన చలనం జరిగింది.

## సేవ చేయడం గొప్ప వరం: మంత్రి



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 21:** ప్రజలకు సేవ చేయడం గొప్ప వరమని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని దామోదరం సంజీవయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాకినాడకు చెందిన సహస్ర చారిటబులల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. చదువులో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్రిష్ణ కిషోర్, ప్రహ్లాదశెట్టి, రాజేశ్వరరెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

**సీఎం సహాయ నిధికి విరాళాలు:** నగరంలోని మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో శనివారం దాతలు సీఎం సహాయ నిధికి మంత్రికి చెక్కులు అందజేశారు. క్రెడాయ్ కర్నూలు చాప్టర్ తరపున రూ.6.50 లక్షలు అందించారు. ఈ సందర్భంగా దాతలను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో క్రెడాయ్ సభ్యులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ



సుంకులా పరమేశ్వరిని దర్శించుకుంటున్న ఎంపీ నాగరాజు

**గూడూరు సెప్టెంబరు 21:** కె.నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారిని ఎంపీ బస్తిపాటి నాగరాజు శనివారం దర్శించుకున్నారు. ఆయనకు స్థానిక టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలను అందజేశారు. టీడీపీ నాయకులు సురేష్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, చిన్న గిడ్డయ్య, యుగంధర్, తిరుపాల్, సుంకన్న, మద్దిలేటి, ఆలయ సిబ్బంది కేశవ ఉన్నారు.

## గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయండి: పీడీ



జగనన్న లేఅవుట్లను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ, అధికారులు

**ఓర్వకల్లు, సెప్టెంబరు 21:** గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని నన్నూరు గ్రామ సమీపంలోని జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూఫ్ లెవెల్‌లో ఉన్న గృహాలను అక్టోబరు నెలాఖరులోగా, బేస్‌మట్టం లెవెల్‌లో ఉన్న గృహాలను మార్చిలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నన్నూరు లేఅవుట్‌లో బేస్‌మట్టంలో 323 గృహాలు, స్లాబ్‌లో 65 గృహాలు ఉన్నాయని పీడీకి ఈఈ వివరించారు. ఈఈ ప్రభాకర్, ఎంపీడీవో శివనాగప్రసాద్, ఏఈ రామయ్య పాల్గొన్నారు.

## మళ్లీ విధుల్లో చేరిన సెక్యూరిటీ సూపర్‌వైజర్

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 21:** కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆదేశాలను బేఖాతరయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న ఇద్దరు సెక్యూరిటీ సూపర్‌వైజర్ల ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ త్రిసభ్య విచారణ కమిటీని జూలై 24న వేశారు. విచారణ నేపథ్యంలో ఇద్దరు సెక్యూరిటీ సూపర్ వైజర్లను ఆసుపత్రి ఆవరణలోకి రానివ్వద్దని సెక్యూరిటీ ఏజెన్సీ ఏఎస్‌వోను ఆదేశించారు. అయితే ఉన్నట్టుండి శుక్రవారం ఆసుపత్రిలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ సెక్యూరిటీ సూపర్‌వైజర్ విధుల్లో చేరడం వివాదాస్పదంగా మారింది. విచారణ పూర్తి కాకుండా సెక్యూరిటీ సూపర్‌వైజర్‌ను ఎలా విధుల్లో తీసుకుంటారని కొందరు ప్రశ్నిస్తున్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 21:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2020 సెప్టెంబరు 22న పార్లమెంటులో నాలుగు లేబర్ కోడ్‌లను ఆమోదించిందని తెలిపారు. వీటి వల్ల ఆయా రంగాలలో పని చేస్తున్న కార్మికులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. లేబర్ కోడ్‌లకు నిరసనగా 23న బ్లాక్‌డే నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సురేంద్ర, విజయ్ పాల్గొన్నారు.

## అనధికార భవనం కూల్చివేత

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 21:** పట్టణంలోని నరసింహారెడ్డి నగర్‌లో అనధికారింగా నిర్మిస్తున్న భవనాన్ని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కూల్చివేశారు. అనుమతి లేకుండా అపార్ట్‌మెంటులో మరొక అంతస్తు నిర్మిస్తుండటంతో శనివారం అధికారులు చర్యలు తీసుకున్నారు. గతంలో కూడా సంబంధిత యజమానికి నోటీసులు జారీ చేసినా పట్టించుకోకపోవడంతో కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు.

## నేడు గయోపాఖ్యానం నాటకం

**కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 21:** రాయలసీమకు చెందిన ధూపం తిరుమల తేజ నటిస్తున్న గయోపాఖ్యానం పద్య నాటకం యుద్ధ సీను టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ప్రదర్శిస్తున్నట్లు అధ్యక్షుడు పత్తిఓబులయ్య ఆదివారం తెలిపారు. ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా వేలాది మంది అభిమానులను కలిగిన ఈమె మొదటిసారి కర్నూలుకు వస్తున్నారని అన్నారు.

## ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలి

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21:** రాష్ట్రంలో ఉన్న వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి నాయుడు అన్నారు. ఆదివారం వాల్మీకి బోయల ఎస్టీ అంశంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వాల్మీకి ప్రజా ప్రతినిధులు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ మధుసూదన్ నాయుడు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**సి.బెళగల్, సెప్టెంబరు 21:** రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. మండలంలోని తిమ్మనదొడ్డి పక్కన ఉన్న తుంగభద్ర నది నుంచి నందవరం మండలంలోని టీ సోమలగూడూరు గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రాష్ట్ర ప్రగతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

**కల్లూరు, సెప్టెంబరు 21:** రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 41వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో అద్భుతమైన విజయాలు సాధించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తులకు ఇచ్చే ప్రసాదాన్ని అపవిత్రం చేసి వారి మనోభావాలు దెబ్బతీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కమిషనర్ ఎస్. రవీంద్రబాబు మాట్లాడారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి జనార్దన్ ఆచారి, 37, 41వ వార్డు ఇన్‌చార్జి క్రిష్ణవేణమ్మ, నాగేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, జవ్వాజి గంగాధర్‌గౌడ్. కాసాని మహేష్‌గౌడ్, కె.ధనుంజయ, ఫిరోజ్, ఎంఈ శేష సాయి, టీపీఆర్వో వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



కోడుమూరు మండలం పులకుర్తిలో..

**అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం:** కల్లూరు ఎస్టేట్‌లోని అన్న క్యాంటీన్‌కు టీడీపీ నాయకులు రూ.లక్ష విరాళం అందజేశారు. శనివారం ఎమ్మెల్యే గౌరు చరితకు పందిపాడు టీడీపీ నాయకులు కూరపాటి దేవేంద్రారెడ్డి, గూడూరు శేఖర్‌చౌదరి ఆధ్వర్యంలో గుమ్మల్ల విజయమోహన్ రెడి, గుమ్మల్ల సూర్యప్రకాష్‌రెడ్డి రూ.లక్ష చెక్కును అందజేశారు. అదేవిధంగా నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ రూ.50 వేలు, 37వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కె.క్రిష్ణవేణి రూ.50వేలు, పరిమళనగర్ అన్న క్యాంటీన్‌కు విరాళాన్ని ఎమ్మెల్యే గౌరు చరితకు అందజేశారు. ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమంలో పూల శివశంకర్, లక్ష్మణ్‌యాదవ్, జనార్దన్ ఆచారి పాల్గొన్నారు.

**ఓర్వకల్లు:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం మండలంలోని తిప్పాయ పల్లె, శకునాల, బ్రాహ్మణపల్లె తదితర గ్రామాల్లో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, మౌలీశ్వరరెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటై వందరోజుల్లోనే సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

**సి.బెళగల్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఈవోఆర్డీ సందీప్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కంబంధహాల్, గొల్లలదొడ్డి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వ కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అభిషేక్, ఎంపీటీసీ శోభారెడ్డి, మాజీ ఎంపీటీసీ యాకోబు, ముస్లిం మైనార్టీ నాయకుడు దూద్‌వలి, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**కోడుమూరు(రూరల్):** మండలంలోని పులకుర్తి, వర్కూరు గ్రామాల్లో కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై ప్రజలకు తెలియజేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్వర్యంలో ఇంటింటికీ స్టిక్కర్లు అతికించి, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మంజుల, పంచాయతీ కార్యదర్శులు విజయభారతి, సంజీవరావు, టీడీపీ నాయకుడు రాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత



తిప్పాయపల్లెలో స్వీట్లు పంపిణీ చేస్తున్న అధికారులు



సి.బెళగల్‌లో..

# పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్: ఎమ్మెల్యే దస్తగిరి

**గూడూరు సెప్టెంబరు 21:** పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లను సీఎం చంద్రబాబు నాయుడు పునః ప్రారంభించారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం గూడూరులో వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజా వేదిక గ్రామ సభకు ఎమ్మెల్యే దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమని, చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నార న్నారు. బాలికల వసతి గృహం, విశ్రాంతి భవనం, నగర పంచాయతీ తహసీల్దార్, కార్యాలయాలకు నిధుల విడుదల చేయించారన్నారు. కోడుమూరు నుంచి వయా గూడూరు మీదుగా రాజోలి వరకు బస్సు తిరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మెప్మా అర్బన్ మార్కెట్‌ను సందర్శించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కురుకుంద రామాం జనేయులు, గజేంద్ర గోపాల్ నాయుడు, పౌలు, దండు సుందరరాజు, దానమన్న, కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, బుడ్డంగలి, మన్సన్‌బాషా, సుమన్ బాబు, నాగప్పయాదవ్, గుడిపాడు మహేశ్వర రెడ్డి, తెలుగు శ్రీను, చాంద్ బాషా, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

**గ్రామాలను అభివృద్ధి చేద్దాం: ఎమ్మెల్యే**

**కర్నూలు(రూరల్):** గ్రామాలను కలిసికట్టుగా అభివృద్ధి చేద్దామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సర్పంచు, ఎంపీటీసీ సభ్యులకు సూచించారు. కర్నూలు రూరల్ మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో శనివారం ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కోడు మూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరై సభ్యులనుద్దేశించి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయలేదని, సర్పంచులకు పైసా నిధులు ఇవ్వకుండా పంచాయతీ వ్యవస్థను మరుగున పడేసిందన్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో సర్పంచులకు అత్యధిక ప్రాధాన్యం కలిపిస్తోందన్నారు. ఈసమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అనూరాధ, ఎంఈవో హనుమంతరావు, పీఆర్ ఏఈ, రవిమోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ రంగస్వామి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 21:** నగరంలోని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. శనివారం 40వ వార్డులో కార్పొరేటర్ విక్రమసింహారెడ్డితో కలిసి పర్యటించారు. అనంతరం సాయిబాబాగేరి, ప్రకాశ్‌నగర్, బంగారుపేట తదితర ప్రాంతాలలో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. తుంగభద్ర నదితీరాన ఎస్టీపీకి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, పబ్లిక్ హెల్త్ ఈఈ మురళీమోహన్, డీఈ నరేష్, ఏఈ దినేష్, ఏసీపీ రంగస్వామి ఉన్నారు.

## మంత్రిని కలిసిన కమిషనర్

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 21:** రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## నేడు ఎమ్మెల్యే రాక

**సి.బెళగల్, సెప్టెంబరు 21:** మండల కేంద్రమైన సి.బెళగల్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి రానున్నట్లు ఎంపీటీసీ ఈరన్నగౌడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సి.బెళగల్‌లో పాత బస్టాండులో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, టీడీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

## మెనూ పాటించకపోతే చర్యలు: ఎంఈవో

**సి.బెళగల్, సెప్టెంబరు 21:** మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించకపోతే చర్యలు తప్పని వంట ఏజెన్సీలను ఎంఈవో ఆదాం బాషా హెచ్చరించారు. శనివారం మండల విద్యావనరుల కేంద్రంలో వంట ఏజెన్సీలతో ఆయన సమావేశం నిర్వహించారు. సీఆర్‌పీలు, వంట ఏజెన్సీలు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందిపై కేసు నమోదు

**కర్నూలు, సెప్టెంబరు 21:** నగరంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి 11 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. స్థానిక సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ వద్ద ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ శంకర్ మల్లయ్య ఆధ్వర్యం లో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11 మందిపై కేసులు నమోదు చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కారులను స్వాధీనం చేసుకుని వీరిని కోర్టులో హాజరు పరుస్తామని సీఐ శంకర్ మల్లయ్య తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఎర్రన్న, ఆర్ఎస్ఐ డి.అహ్మద్ హుశేన్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులకు టీకాలు వేయించాలి

**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 21:** చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు తెలిపారు. నగరంలో గడ్డ వీధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దండిగేరి సచివాలయంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సందర్శించారు. అనంతరం తల్లులు, గర్భిణులతో మాట్లాడి తల్లిబిడ్డల కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ప్రాజెక్షనిస్టు ఖలీల్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## కర్నూలులో కార్డెన్ సెర్చ్



కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

**కర్నూలు, సెప్టెంబరు 21:** జిల్లాలో కర్నూలు, పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ బిందు మాధవ్ ఆదేశల మేరకు డీఎస్పీలు వెంకట్రామయ్య, బాబు ప్రసాద్ అధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలతోపాటు స్పెషల్ పార్టీ బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయి. శనివారం తెల్లవారుజామున జరిగిన దాడుల్లో రౌడీషీటర్ల అనుమానాస్పద ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. సారా, అక్రమ మద్యం నిర్వహించి కర్నూలు శరీన్‌నగర్, పత్తికొండలో ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా ఉన్న మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. అనుమానితులను ప్రశ్నించారు.

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్

**కల్లూరు, సెప్టెంబరు 21:** నగరంలోని హోటల్ మౌర్యా ఇన్ కాంప్లెక్స్‌లో సహస్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సైకిల్ పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ హాజరై మాట్లాడారు. చరిత్రలో ఎంతో గొప్పవారుగా నిలిచిన వారు చాలా చిన్నస్థాయి నుంచి స్వయం కృషితో ఎదిగిన వారే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం సహస్ర చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కృష్ణకిషోర్ మాట్లాడుతూ తాము చేపట్టిన ఈకార్యక్రమంలో టీజీ వెంకటేష్ పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. సహస్ర చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సాయి వర్మ, కృష్ణకిషోర్, సుష్మ, టీజీవి గ్రూపు హెచ్ఆర్ విభాగం హెడ్ ప్రహ్లాదశెట్టి పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 21:** నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక కర్షక భవన్‌లో జరిగిన చిన్న వ్యాపారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

## దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 21:** పెద్దకడుబూరు మండలం కల్లకుంట గ్రామంలో దళిత మహిళపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని సామాజిక విశ్లేషకుడు కొమ్ములపాలెం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి రాజకీయ పార్టీలు, దళిత, మహిళ, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దళిత మహిళకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 23న ఎస్పీ, 25న అన్ని మండల కార్యాలయాల్లో వినతులు ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు.

## బీఈడీలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 21:** బీఈడీ అభ్యర్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఆర్‌పీవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాజా కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎస్ వెంకటేశ్వర్లును రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్‌పీవీఎఫ్) నాయకులు వినతి పత్రం అందజేశారు.

## జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

**కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 21:** యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో వైజాగ్‌లో నిర్వహించిన 49వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో సి.లిఖిత్ 7వ తరగతి విద్యార్థి (12, 14 కేటగిరిలలో ప్రతిభ కనబరిచి 3వ స్థానాన్ని సాధించి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య విద్యార్థిని అభినందించారు.

## కేవీఆర్‌లో న్యూట్రి టూరిజం ఫేర్

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 21:** కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో న్యూట్రి టూరిజం ఫేర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులు పలు రకాల పోషకాహార వంటలను తయారు చేసి అమ్మకానికి స్టాల్స్ ఏర్పాటు చేశారు. రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, వైఎస్ ప్రిన్సిపాల్ దేవికా రాణి, అరతి చక్ర, రాధా రమణి, విజయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా గురజాడ జయంతి

**కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 21:** స్థానిక పింగళి సూరన తెలుగు తోటలో గురజాడ జయంతి సదస్సును శనివారం ఘనంగా నిర్వహించారు. సాహిత్యాన్ని సమాజానికి చేరువ చేసి, సంఘ సంస్కరణలో కొత్త బీజాలు వేసిన మహానుబావుడు గురజాడ అప్పారావు అని జేఎస్ఆర్‌కే శర్మ అన్నారు. ఈసందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సుబ్బలక్ష్మి, అజీజ్, సునీత, సుధీర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## జగన్‌ను శిక్షించాలి: తిక్కారెడ్డి



మాట్లాడుతున్న తిక్కారెడ్డి

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 21:** తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయించిన వైఎస్ జగన్‌ను శిక్షించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్ అక్రమాలు చేసి కోట్లాది రూపాయల సొమ్మును దోచుకున్నాడని మండిపడ్డారు. చివరికి వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని, ఇలాంటి వారిని ఉపేక్షించ కూడదన్నారు. కార్య క్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, కె.నాగేంద్రకుమార్, సత్రం రామకృష్ణుడు పాల్గొన్నారు.

## లడ్డూను అపవిత్రం చేయడం దుర్మార్గం

**ఓర్వకల్లు, సెప్టెంబరు 21:** తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూను అపవిత్రం చేయడం దుర్మార్గమని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. శనివారం ఓర్వకల్లులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి సేకరించిన వ్యర్థాలతో తయారు చేసిన కొవ్వు, నెయ్యితో ప్రసాదాలు తయారు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, అబ్దుల్లా, సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## న్యాయం జరిగే వరకు పోరాటం

### దళిత మహిళను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 21:** దళిత మహిళ గోవిందమ్మకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షురాలు ఎ.వెంకట సుజాత అన్నారు. శనివారం కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ప్రమీలతో కలిసి ఆమె పరామర్శిం చారు. ఈ సందర్భంగా ఎ.వెంకట సుజాత మాట్లాడుతూ ఎమ్మిగనూరులో దళిత మహిళ గోవిందమ్మను కట్టేసి కొట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుం డా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పి.సావిత్ర, సంజమ్మ, లలిత పాల్గొన్నారు.

## క్రీడల్లో జడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**కర్నూలు(రూరల్), సెప్టెంబరు 21:** కర్నూలు రూరల్ మండలం ఉల్చాల గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటారు. కర్నూలులోని అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ టోర్నమెంట్‌లో (అండర్ 14, 17 బాలుర, బాలికలు) ఆ పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు హైజంప్, ఖోఖో, వందమీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, జావెలిన్‌త్రో, కబడ్డీ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ ఎం సర్తాజ్ ఉన్నీసాబేగం, ఉపాధ్యాయులు క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

**నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులు..**

**కర్నూలు(స్పోర్ట్స్):** నగరంలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటి విజేతలయ్యారు. ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో యోగాలో అకిల్ ప్రథమం, డిస్కస్‌త్రోలో ప్రథ మంగా యధ్వంత్ ఆచారి, ద్వితీయ స్థానంలో హైజంప్‌లో ఉమర్ ప్రథమ స్థానం, వాలీబాల్ క్రీడలో రన్నర్, ఖో-ఖో, కబడ్డీలో ఫయాజ్, అబ్బాస్, ఉమర్‌లు సాధించారు. అలాగే అండర్-17లో ఖో-ఖో ఫైసల్, వాలీబాల్‌లో అఖిల్, కబడ్డీ మాబాసా, యోగాలో వీరేష్‌లు ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని పీఈటీ సుబ్రహ్మణ్యం తెలిపారు. విజేతలను హెచ్‌ఎం శ్రీనివాసరావు అభినందించారు.

**ఓర్వకల్లు:** ఓర్వకల్లులో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో బాలభారతి పాఠశాల విద్యార్థులు అండర్-14, 17లో వాలీబాల్ గేమ్‌లో ప్రతిభ కనబరిచినట్లు క్లైయిమెట్ ప్రిన్సిపాల్ సత్యబాబు తెలిపారు. అండర్-17లో బాలికల విభాగంలో బాలభారతి పాఠశాల మొదటి స్థానంలో, జడ్పీహెచ్‌ఎస్ ఓర్వకల్లు ద్వితీయ స్థానం, అండర్-14 బాలికల విభాగంలో జడ్పీహెచ్‌ఎస్-ఓర్వకల్లు మొదటి స్థానం, బాలభారతి పాఠశాల ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు, మండల కన్వీనర్ హరి పాల్గొన్నారు.

## క్రీడా పోటీలు ప్రారంభం

**కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 21:** స్థానిక డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి అండర్-14, 17 బాల బాలికలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యాశాఖ సహాయ అధికారి హనుమంతరావు, క్రీడా దాత న్యాయవాది శ్రీధర్ రెడ్డి, విశ్రాంత జాయింట్ విజిలెన్స్ కమిషనర్ నరసింహం పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

**కర్నూలు, సెప్టెంబరు 21:** రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్ఆర్ పేటలో అనురాధ (24) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక ధర్మపేటకు చెందిన అనురాధ డిగ్రీ పూర్తి చేసింది. ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన మహబూబ్‌బాషా అలియాస్ చోటులు అనురాధ కొద్ది కాలంగా ప్రేమించుకుంటున్నారు. మహబూబ్ బాషా ఓ బ్యూటీ పార్లర్‌లో మేనేజర్‌గా పని చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. అనురాధ గత నెలన్నర కింద తనకు హైదరాబాదులో బ్యూటీషియన్ జాబు వచ్చిందని తల్లిదండ్రులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ నెల రోజుల పాటు హైదరాబాదు వెళ్లకుండా ఎన్ఆర్‌పేటలో మహబూబ్ బాషాతో కలిసి ఓ ఇంట్లో నివాసం ఉంది. ఇటీవల జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా ఇంటికి వెళ్లింది. ఉద్యోగానికి రెండు రోజులు పాటు సెలవు ఇచ్చారని తెలిపింది. తర్వాత రెండు రోజుల క్రింద మహబూబ్ బాషా అనురాధను తీసుకుని ఎన్ఆర్‌పేటలోని తన ఇంటికి వెళ్లాడు. శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో అనురాధ తల్లిదండ్రులకు ఫోన్ చేసి అనురాధ ఆత్మహత్య చేసుకుందని సమాచారం ఇచ్చాడు. అవాక్కయిన తల్లిదండ్రులు పోలీసుల ద్వారా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ ఇంట్లో చీరతో అనురాధ ఉరి వేసుకుని కనిపించింది. మహబూబ్ బాషా పరారయ్యాడు. స్థానిక ఆటో డ్రైవర్లు మహబూబ్ బాషాను పట్టుకునే ప్రయత్నం చేసినా పరారైనట్లు సమాచారం. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి బంధువులకు అప్పగించారు. తమ కూతురు మృతికి మహబూబ్ బాషా కారణమంటూ తల్లి నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు రావు తెలిపారు.

## హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

**పత్తికొండ టౌన్, సెప్టెంబరు 21:** కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో ప్రజలకిచ్చిన హామీలు, సూపర్‌సిక్స్ పథకాలను విస్మరించిందని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కే.శ్రీదేవి అన్నారు. శనివారం మాట్లాడుతూ ఎన్నికల్లో ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మూడు నెలలైనా హామీలను అమలు చేయలేదని అన్నారు. ఎంపీపీ నారాయణ దాసు, వైసీపీ మండల కన్వీనర్ నాగరాజు, నాయకులు బాబుల్ రెడ్డి, బనగాని శ్రీను, సర్పంచ్ అంజినేయ ఉన్నారు.

## అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయండి

**మద్దికెర, సెప్టెంబరు 21:** మండలంలో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని ప్రత్యేకాధికారి ఉమాదేవి సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రహదారులు, ఇళ్ల నిర్మాణాలపై సర్వే చేయాలని అన్నారు. ఎంపీడీవో సువర్ణలత, ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, ఏపీవో నర్సిరెడ్డి, హౌసింగ్ ఏఈ ఉమాకాంత్, పంచాయితీ రాజ్ ఏఈ విష్ణు ఉన్నారు.

## ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా కృష్ణ



**ఆదోని టౌన్, సెప్టెంబరు 21:** ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా ఎం కృష్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డీఎంఎ కార్యాలయం నుంచి ఉత్తర్వులు కార్యాలయానికి చేరాయి. రాయదుర్గం, పామిడి, ఎమ్మిగనూరులో కమిషనర్‌గా పని చేసిన కృష్ణను ఆదోనికు బదిలీ చేశారు. ఇంతవరకు అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

## విద్యార్థికి బుట్టా ఆర్థిక సాయం


విద్యార్థితో బుట్టా రేణుక

**ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 21:** మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన నవీన్ కూమార్‌కు వైసీపీ ఇన్‌చార్జి బుట్టా ఆర్థిక సాయం చేశారు. పేదరికంతో చదువు ఆగిపోకూడదని రూ.44వేలు సాయం చేసినట్లు ఆమె తెలిపారు. బుట్టా రేణుకకు విద్యార్థి కృతజ్ఞతలు తెలిపారు.

## గోవిందమ్మపై దాడి అమానుషం


బాధితురాలిని పరామర్శిస్తున్న మురళీకృష్ణ

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 21:** గోవిందమ్మపై దాడి అమానుషమని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ అన్నారు. శనివారం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రమీళ, సేవాదల్ నాయకురాలు వెంకటసుజాతతో కలిసి ఎమ్మిగనూరులో చికిత్స పొందుతున్న గోవిందమ్మను పరామర్శించారు. దాడికిగల కారణాలను తెలుసుకున్నారు. గోవిందమ్మకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని కోరారు. లలిత, సావిత్రి, సంజమ్మ, సలోమి పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ శాంతి దినోత్సవం

**ఆదోని టౌన్, సెప్టెంబరు 21:** లయన్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా శనివారం బాలికల పాఠశాలలో ప్రపంచశాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. క్లబ్ జిల్లా చైర్మన్ గోపీనాథ్ మాట్లాడుతూ ప్రపంచ శాంతితోనే అభివృద్ధి సాధ్యమని, యుద్ధంతో దేశాలు నాశనమవుతాయన్నారు. పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రసాదరావు అధ్యక్షుడు దర్మారెడ్డి కార్యదర్శి వంకదారు శ్రీనాథ్ గుప్తా, వన్నప్ప రాజు, వెంకటేశ్వర్లు, రఘు, మమతాశ్రీ, అనూష సిబ్బంది వెంకట రమణారెడ్డి, నాగిరెడ్డి, ఇందిర, జయప్రద పాల్గొన్నారు.

**ఎమ్మిగనూరు టౌన్:** నలందా జూనియర్ కళాశాల అధ్వర్యంలో విద్యార్థులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ తిరుపతమ్మ మాట్లాడుతూ జెండాలో తెలుపు శాంతిని సూచిస్తుందన్నారు.

## టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

**ఆలూరు రూరల్, సెప్టెంబరు 21:** టీడీపీ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని అరికెర సర్పంచ్ కుప్పగల్లు నాగరాజు అన్నారు. శనివారం గ్రామంలో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిధులు విడుదల చేయడం హర్షణీయమన్నారు. కార్యదర్శి ఉసేని, ఉపసర్పంచ్ లక్ష్మీ నారాయణ, టీడీపీ నాయకులు కుప్పగల్లు మల్లేష్, మల్లప్ప, గోవిందు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరులో 'ఇది మంచి ప్రభుత్వం'

**ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 21:** పట్టణంలోని క్రాంతి నగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ వంద రోజుల్లో అన్న క్యాంటీన్, పంచన్‌ను రూ.4వేల కు పెంచారని తెలిపారు. వార్డు ఇన్‌చార్జ్ నూరి, కదిరికోట షాలెం, అంబేడ్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విపత్తులను ఎదుర్కోవడం చంద్రబాబుతోనే సాధ్యం


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు, అధికారులు

**ఆదోని రూరల్, సెప్టెంబరు 21:** విపత్తులను ఎదుర్కోవడం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు తెలిపారు. శనివారం చిన్నపెండేకల్లు, బైచిగేరిలో ఇది మంచి ప్రభుత్వంలో పాల్గొన్నారు. నాడు విశాఖ, నేడు విజయవాడ వరదలను టీడీపీ ప్రభుత్వం ఎదుర్కొని, బాధితులకు భరోసా ఇచ్చిందన్నారు. బాబునాయుడు, రామస్వామి, రంగన్న, బసవరాజు, కృష్ణారెడ్డి, మాబాష, శేఖర్,నాగప్ప, శ్రీనివాస్ చౌదరి, మహానందిరెడ్డి, దేవేంద్ర, బుజ్జిరెడ్డి, కార్తిక్, రాముడు, భగవాన్ సింగ్, హనుమాన్‌సింగ్, వీరాంజనేయులు, సర్పంచ్ మహదేవ, అధికారులు విజయలక్ష్మి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

**ఆస్పరి:** సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని సర్పంచులు లతాశ్రీ, ఆంజనేయులు, సుధమ్మ అన్నారు. శనివారం అట్టేకల్లు, తొగలగల్లు, యాటకల్లు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు సీఎం చంద్రబాబు హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని అన్నారు. ఐసీడీఎస్ పద్మమ్మ, డీటీ గాయత్రి, మాజీ ఎంపీటీసీ శివకుమార్, రాజశేఖర్, వీరభద్రి పాల్గొన్నారు.

## లడ్డూ కల్తీపై చర్యలు తీసుకోవాలి

**ఆదోని, సెప్టెంబరు 21:** తిరుమల లడ్డూ కల్తీపై చర్యలు తీసుకోవాలని విరాట్ హిందుస్థాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామాంజినేయులు, విట్టా రమేష్, అశోక్, నారాయణ, పరమేష్, అడివేస్ యువరాజ్, గిరిస్వామి, ప్రసన్న స్వామి డిమాండ్ చేశారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కల్తీ విషయంలో ప్రధాన సూత్రధారులు, దోషులు ఎవరో కనిపెట్టాలన్నారు. తమిళనాడు దిండిగల్‌కు చెందిన ఫుడ్ పరిశ్రమ కల్తీ నెయ్యి తిరుమలకు సరఫరా చేసినట్లు తెలిసిందన్నారు. ఇందులో పాత్రధారులు, సూత్రధారులు అందరూ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

# వైసీపీ నిర్లక్ష్యం రైతుకు శాపం!

● కాలువల ఏర్పాటు మరిచిన గత ప్రభుత్వం
● నీరందక ఎండిపోతున్న పంటలు


గద్దెరాళ్ల సమీపంలో శిథిలమైన కాలువ గట్టు

**దేవనకొండ, సెప్టెంబరు 21:** కాలువ ద్వారా వేలాది ఎకరాలు సాగులోకి తేవాలనే హంద్రీ నీవా విభాగం ఏర్పాటు చేశారు. ఈ విభాగం కింద కృష్ణా నది జలాలను కాలువ ద్వారా తరలించి పందికొన జలాశయానికి చేరుస్తారు. అక్కడి నుంచి పిల్ల కాలువల ద్వారా పొలాలకు సాగునీరివ్వాలి. అయితే నిర్వహణ కొరవడడం, గత వైసీసీ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. మండలంలోని 50,626 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది హంద్రీ నీవా లక్ష్యం అయితే 20వేల ఎకరాల్లోపు పొలాలకు మాత్రమే నరందుతోంది.

### వైసీపీ నిర్లక్ష్యమే కారణం

కాలువ నిర్వహణ, పిల్ల కాలువల ఏర్పాటును గత వైసీపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విస్మరించింది. 2014లో నాటి టీడీపీ ప్రభుత్వం చేసిన పనులే ఇప్పటికీ ఉన్నాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాలువ వైపు కన్నెత్తి చూడలేదు.

### నీరున్నా అందదు..

ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువల ద్వారా పొలాలకు నీరందాలి. అయితే పిల్ల కాలువలు డిస్ట్రిబ్యూటరీలు లేవు. కొన్నిచోట్ల ఉన్నా నిర్వహణ లేదు. దేవనకొండ, పల్లెదొడ్డి, గద్దెరాళ్ల, కుంకునూరు, జిల్లేడ బుడకల, కప్పట్రాళ్ల తదితర గ్రామాలకు నీరు వస్తున్నా పిల్ల కాల్వలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పిల్లకాల్వల ఏర్పాటు, నిర్వహణకు నిధులు లేకపోవడంతో అవి కాస్తా శిథిలావస్థకు చేరాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

### మోటార్లతో ఎత్తిపోసుకుంటే..

ప్రధాన కాలువలో నీరు పుష్కలంగా ఉన్నా, అక్కడి నుంచి మోటర్లతో నీరు ఎత్తిపోసుకోవాలంటే రోజుకు మోటర్ బాడుగ, డీజిల్, కూలీ మొత్తం రూ.10వేల వరకు వస్తుంది. దీతో ఇది తలకు మించిన భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నీరందలేదు



పంట వేసాక, నెల రోజులు వర్షం కురవలేదు. దీంతో పత్తి పంట నష్టపోయా. కాలువలకు నీరు వదిలింటే ఇలా అయ్యేది కాదు.
- చిరంజీవి, రైతు, దేవనకొండ

### రూ.200 కోట్లతో ప్రతిపాదనలు

కుడి కాలువ కింద పెండింగ్ పనులకు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. నిధులు మంజూరైన వెంటనే పిల్లకాలువలు, డిస్ట్రిబ్యూటరీలను పూర్తి చేస్తాం. - గోపీనాథ్, డీఈ

## మఠం గోశాలకు విరాళం

**మంత్రాలయం, సెప్టెంబరు 21:** మఠానికి చెందిన గోశాల నిర్మాణికి ముంబాయి భక్తులు సుమతి జే శెట్టి రూ. 9,36,101, బెంగళూరుకు చెందిన రాఘవేంద్ర రూ.7 లక్షలు విరాళం ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్ తెలిపారు. దాతలకు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

## ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి

**మంత్రాలయం, సెప్టెంబరు 21:** పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శనివారం బెంగళూరుకు ధార్మిక పర్యటనకు వెళ్లారు. పర్యటన ముగించుకుని ఆదివారం మంత్రాలయానికి చేరుకుంటారని ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు.

## అలాంటి వాటిని సహించం

**మంత్రాలయం, సెప్టెంబరు 21:** పుణ్యక్షేత్రంలో అసాంఘిక కార్యకలాపాలను సహించబోమని ఎస్‌ఐ పరమేష్ నాయక్ హెచ్చరించారు. శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ప్రైవేటు లాడ్జిల యజమానులతో సమావేశం నిర్వహించారు. పేకాట, మద్యం, వ్యభిచారాలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించామని, యజమానులు సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఒంటరిగా వచ్చే వారికి గదులు ఇవ్వొద్దని, రికార్డులలో ఆదార్‌కార్డు ఆధారంగా అడ్రస్, పోన్ నెంబర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దశరథరాముడు, కృష్ణయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం మరొకరికి ప్రాణదానం


రక్తదాతకు సర్టిఫికెట్ ఇస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

**పత్తికొండ, సెప్టెంబరు 21:** రక్తదానం మరొకరికి ప్రాణదానమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. తలసేమియా బాధితుల కోసం పత్తికొండ డిగ్రీ కళాశాల విద్యార్థులు వంద మంది శనివారం రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ మాధురి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రారంభించారు. వైద్యురాలు కల్పన, కోఆర్డినేటర్ రామక్రిష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, నరసింహ చౌదరి, శ్రీధర్‌రెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

### చరిత్ర సృష్టించిన ప్రభుత్వం

**మద్దికెర:** వంద రోజుల్లో ప్రజలకు మంచి పనులు చేసి టీడీపీ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం మండలంలోని బొమ్మనపల్లిలో సర్పంచ్ బొమ్మన్నపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వంలో స్టిక్కర్లు అతికించారు.

**మద్దికెర:** పత్తికొండ తాలుకాను సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. శనివారం మండలంలోని హంపా, బొమ్మనపల్లి గ్రామాల్లోని హంద్రీనీవా కాలువను పరిశీలించారు. కృష్ణగిరి నుంచి మద్దికెర వరకు హంద్రీనీవా కాలువ 80 కి.మీల పొడవు ఉంటుందని, నిబంధనల మేరకు 8 టీఎంసీల నీరు వాడుకోవడానికి ప్రభుత్వం మనకు అవకాశం కల్పించిందని అన్నారు. సర్పంచ్ బొమ్మనపల్లి ఆంజనేయులు, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అశోక్ కుమార్, ఎంపీటీసీ రంగస్వామి ఉన్నారు.

# 'కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం'


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేష్ యాదవ్

**ఆదోని టౌన్, సెప్టెంబరు 21:** కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రమేష్ యాదవ్ విమర్శించారు. మాధవరానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడ్డ భారీ గుంతలను తన సొంత ఖర్చులతో పూడ్చారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా అభివృద్ధి ఏమీ లేదని, గత వైసీపీ ప్రభుత్వం రహదారులను పట్టించుకోని కారణంగా రోడ్లపై భారీ గుంతలు ఏర్పడ్డాయని అన్నారు. అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్‌ను తుంగలో తొక్కి ఎవరికి వారేలా చేశారన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలి


డీడీ వెంకటలక్ష్మమ్మతో మాట్లాడుతున్న నాయకులు

**ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 21 :** అస్వస్థతకు గురైన బీసీ హాస్టల్ విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని పీడీఎస్‌వో రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ కోరారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఉడకని అన్నం, నీళ్ల చారు పెట్టడం వల్ల అనారోగ్యానికి గురయ్యారని ఆరోపించారు. హాస్టల్ నుంచి కళాశాలకు వెళ్లాలంటే కనీసం మూడు కిలోమీటర్లు నడవాలని, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థినులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ప్రతినెల ఆరోగ్య పరీక్షలు చేయాలని కోరారు. శివ, రాజేష్, వీరేష్ పాల్గొన్నారు.

## జాతీయ ఫార్మా వారోత్సవాలు

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 21:** సెయింట్‌జాన్స్ ఫార్మసుటికల్(ఇంజనీరింగ్) కళాశాలలో 4వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు మందులు, వ్యాక్సిన్ల యొక్క ప్రతికూల ప్రభావాలను గుర్తించడం, వాటిని అంచనా వేయడం, నిరోధించడంపై కేఎంసీ ఫార్మాకోవిజిలెన్స్ అసోసియేట్ డాక్టర్ సతీష్‌కుమార్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ వాగేష్, హెచ్‌వోడీ రంగారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి రాజశేఖర్, పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**తుగ్గలి, సెప్టెంబరు 21:** ప్రజల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ నాయకుడు పగిడిరాయి రమేష్, నారాయణగౌడ్ అన్నారు. శనివారం జొన్నగిరి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ జయశేఖర్ గౌడును సన్మానించారు. నాయకులు పీర్లరంగ స్వామి, తదితరులు ఉన్నారు.

## ప్రజల సంక్షేమమే ధ్యేయం

**తుగ్గలి, సెప్టెంబరు 21:** ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేయడమే టీడీపీ ధ్యేయమని సర్పంచ్ చౌడప్ప, ప్రతాప్ యాదవ్, మహేష్‌గౌడు అన్నారు. శనివారం బొందిమ డుగుల, నునుసురాళ్ల తదితర గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో ప్రజలను నట్టేట ముంచిందన్నారు. కార్యదర్శి రామాంజనేయులు, దేవదాసుగౌడు, దేవేంద్ర, రామాంజనేయులు, తదితరులు ఉన్నారు.

## వరద బాధితులకు చేయూత

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 21:** వరద బాధితులకు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు చేయూతనందించారు. వారం రోజులుగా ఎమ్మిగనూరులో వివిధ వర్గాల నుంచి ప్రజల నుంచి సేకరించిన నిత్యావసర సరుకులు, దుస్తులు, సామగ్రిని విజయవాడకు తరలించారు. అక్కడ వరద బాధితుల ఇంటింటికి వెళ్లి కిట్లను అందజేశారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యం

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 21:** పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలమ్మ అన్నారు. పౌష్టికాహార శనివారం పట్టణంలోని ఇందిరానగర్ 19, 20 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, మహిళలకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం గిడ్డమ్మ, మహిళా పోలీసు సబిత, అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, నరసమ్మ పాల్గొన్నారు.

## చేతి వృత్తులకు త్వరలో శిక్షణ

**ఆదోని టౌన్, సెప్టెంబరు 21:** పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన పథకం కింద దరఖాస్తు చేసుకున్న చేతివృత్తుల వారికి అక్టోబర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు విశ్వకర్మ స్కీమ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యుడు మల్లేకర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం ఒక లక్ష ఇరవై మూడు వేల మంది వివిధ చేతివృత్తుల వారు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

## అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ

**పత్తికొండ టౌన్, సెప్టెంబరు 21:** అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు అని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. శనివారం శాంతి టాలెంట్ హై స్కూల్ ఆవరణలో మహాకవి గురజాడ అప్పారావు 162వ జయంతి నిర్వహించారు. తెలుగు భాషకు అడుగుజాడ మన గురుజాడ అన్నారు. అభ్యుదయ కవులకు, రచయితలకు ఆదర్శనీయులు గురజాడ అని ఆయన అడుగుజాడల్లో యువ కవులు పయనించాలని కోరారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు నాగరాజు, రహంతుల్లా, హనుమంతు, రజిని, తదితరులు పాల్గొన్నారు.

# పత్తికొండ పట్టణంలో కార్డెన్ సెర్చ్


పత్తికొండ స్టేషన్ వద్ద పోలీసులు

**పత్తికొండ, సెప్టెంబరు 21:** నేరనియంత్రణ చర్యల్లో బాగంగా శనివారం పోలీసులు పత్తికొండ పట్టణంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు తనిఖీ చేశారు. డీఎస్పీ వెంకట్రామయ్య నేతృత్వంలో ఆరుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్‌ఐలు, 62 మంది పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి దుకాణాలు, అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశరు. పట్టణానికి వచ్చే రహదారులన్నింటిలో వాహనాలను తనిఖీ చేశారు. దుకాణాలు, ఇళ్లల్లో సోదాలు జరిపి 15 బైకులు, 20లీటర్ల సారా, 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపారు. మట్కాకు సంబంధించి ఒకరిపై, సారా అమ్మకాలపై మరొకరిపై కేసులు నమోదు చేశామని, నలుగురుని బైండోవర్ చేశామని అన్నారు. కాగా పోలీసులు కార్డెన్ సర్చ్ చేయడం పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**దేవనకొండ ,సెప్టెంబరు 21:** కర్ణాటక మద్యాన్ని ఆటోలో తరలిస్తుండగా స్వాధీనం చేసుకుననట్లు దేవనకొండ సీఐ గిరిబాబు తెలిపారు. వివరాల మేరకు.. ఈదుల దేవరబండ ఎర్రబాడు రోడ్డు వద్ద ఆటోను తనిఖీ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడు చింతకాయల రమేష్ అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

## వ్యక్తికి గాయాలు

**ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 21:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు సిరాలదొడ్డి దాటిన తర్వాత కర్నూలు వైపు వెళ్తున్న బొలెరో వాహనం సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిరాలదొడ్డికి చెందిన కుమ్మరి తిక్కయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు ఎమ్మిగనూరుకు తరలించగా, వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రణాళిక సిద్ధం చేయండి

**మంత్రాలయం, సెప్టెంబరు 21:** మండలంలో అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రత్యేకాధికారి నారాయణ స్వామి, ఎంపీడీవో మణిమంజరి సూచించారు. శనివారం ఎంపీడీవో సమావేశ భవనంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య, పంచాయితీరాజ్ ఏఈఈ నరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేద స్వరూప, ఎంఈవో మైనుద్దీన్, ఏపీవో తిమ్మారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మిదేవి, ఈవోఆర్డీ ప్రభావతి దేవి, ఏపీఎం జయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

**ఆస్పరి, సెప్టెంబరు 21:** వెంగళాయిదొడ్డి చెరువు నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ మస్తాన్‌వలి తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ సమాచారం మేరకు.. అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో ట్రాక్టర్‌ను, కైరుప్పల సమీపంలో మరొకటి పట్టుకొని మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

## గొర్రెల దొంగలు అరెస్టు

**మంత్రాలయం, సెప్టెంబరు 21:** మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన కురువ దేవర నాగుడు చెందిన ఆరు గొర్రెలు, రెండు పొట్టేళ్ల చోరీకి పాల్పడిన దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ రామాంజులు, ఎస్‌ఐ పరమేష్ నాయక్ తెలిపారు. ఈ నెల 7న సూగూరు గ్రామానికి చెందిన దేవర నాగుడుకు చెందిన రూ.లక్ష విలువ చేసే 8 గొర్రెలను అర్థరాత్రి అదే గ్రామానికి చెందిన మల్లికార్జున, వీరనాగుడు, గోనెగండ్ల మండలం గంజిహల్లి గ్రామానికి చెందిన బోయ దుర్గయ్య, మంత్రాలయం ఆటో డ్రైవర్ బాషా ఆటోలో ఎక్కించుకుని ఎమ్మిగనూరు సంతలో అమ్మకానికి పెట్టారు. బాధితుడు పిర్యాదుచేయడంతో సూగూరు క్రాస్ వద్ద ఆరు గొర్రెలు, రెండు పొట్టేళ్లను స్వాధీనం చేసుకుని ఆటో సీజ్ చేసి ఆ నలుగురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వీఆర్వో శ్వేత పంచనామా నిర్వహించి గొర్రెలను బాధితుడు దేవర నాగులుకు అప్పగించినట్లు తెలిపారు. కానిస్టేబుల్స్ దశరథరాముడు, లక్ష్మీకాంత్‌లను అభినందించారు.

## మంత్రాలయంలో టీవీ యాంకర్


గీతాంజలి

**మంత్రాలయం, సెప్టెంబరు 21:** టీవీ యాంకర్ గీతాంజలి కుటుంబ సమేతంగా శనివారం రాత్రి మంత్రాలయానికి వచ్చారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. పండితులు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఐపీ నరసింహమూర్తి, అనంత పురాణిక్, వ్యాసరాజ్ ఆచార్, సూపరింటెండెంట్ జేపీ స్వామి,జయతీర్థ ఆచార్, బిందు మాధవ్ పాల్గొన్నారు.

## శాంతి భద్రతలపై దృష్టి పెట్టండి

**మంత్రాలయం, సెప్టెంబరు 21:** శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించినట్లు మంత్రాలయం సీఐ రామాంజులు తెలిపారు. శనివారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసారు. మంత్రాలయం, మాదవరం స్టేషన్ల పరిధిలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు, చోరీలు, రికవరీలు, రౌడీషీటర్లు, మహిళలపై అఘాయిత్యాలు, ఎస్సీ ఎస్టీ కేసులపై చర్చించారన్నారు. ఎస్‌ఐ పరమేశ్ నాయక్ పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న ఆర్‌పీవీఎఫ్ నాయకుల

**మంత్రాలయం, సెప్టెంబరు 21:** నియోజకవర కేంద్రమైన మంత్రాలయంలో బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆర్‌పీవీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాజా, కృష్ణ బీసీ వెల్ఫేర్ సూపరింటెండెంట్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. వసతి గృహం లేక చాలామంది విద్యకు దూరమవుతున్నారనీ వాపోయారు.

# రూ.15 కోట్లతో రైతులకు సాగు నీరు

- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి
- పూలచింత నుంచి నీటి విడుదల


నందవరం : పూలచింత నుంచి నీటిని విడుదల చేస్తున్న బీవీ

**నందవరం, సెప్టెంబరు 21:** రూ.15 కోట్లతో రైతులకు శాశ్వతంగా సాగునీరు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో గోడు వినవా... రాఘవేంద్ర శీర్శికన కథనం ప్రచురించింది. ఇందుకు స్పందించి శనివారం నందవరంలోని గంగవరం వద్ద పూలచింత రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేశారు. వైసీపీ వైఫల్యంతోనే రైతులకు సాగునీరందలేదన్నారు. వైసీపీ హయంలో మోటర్, కాపర్‌ను దొంగిలిస్తే పట్టించుకోలేదని ఆరోపించారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు స్థాపించిందే తన తండ్రి దివంగత బీవీ మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు. తాము వచ్చి దొంగలను పట్టుకుని, రిజర్వాయర్ల ద్వారా సాగునీరు అందిస్తున్నామన్నారు. ఆర్డీఎస్ రైతుల జీవనాడి అని సీఎం దృష్టికి తీసుకెళ్లానని, జీడీపీ ద్వారా శుభ్రమైన తాగునీటిని అందిస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. గురురాజారావు, బండేగురుస్వామి, పుష్పావతి, ఈరన్న గౌడ్, డీవీ రాముడు, కాశీంవలి, నారాయణరెడ్డి, మస్తాన్, గోపాల్, తిప్పారెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల ప్రారంభం

**గోనెగండ్ల:** మడలంలోని కులుమాల గ్రామంలో ఎమ్మెల్యే అభివృద్ధి పనులను ప్రారంభించారు. శ్రీకారం చుట్టారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలో ప్రతి ఇంటికి కొళాయి ఇవ్వడానికి 80వేల లీటర్ల రక్షిత మంచినీటి సరఫరా పంపును బీవీ ప్రారంభించారు. సీసీరోడ్లు, డ్రైనేజి పనులకు శ్రీకారం చుట్టారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈవోఆర్డీ నాగేష్, కన్వీనర్ నజీర్‌సాహెబ్, తిరుపతయ్యనాయుడు, బేతలబడేసా, నూర్ అహ్మద్, గౌండ రహంతుల్లా, కులుమాల రాముడు, కులుమాల